క్లుప్తంగా

వ్యాయామంతో ఆరోగ్యం

పెనమలూరు: వ్యాయామంతో ఆరోగ్యకర జీవితం గడపవచ్చని ఆర్థోపెడిక్ బెజవాడ పాపారావు అన్నారు. కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన ఆదివారం ఎముకలు, కీళ్ల సంబంధిత సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ఆటల్లో పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యాయామానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మోకాలు, తుంటి నొప్పుల కారణంగా అవయవాల మార్పిడికి యత్నించడకుండా సహజసిద్ధంగా వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఈత గొప్ప వ్యాయామనని తెలిపారు. ఈ సందర్భగా నడుమునొప్పి, ఇతర ఎముకల సమస్యలపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ఏవో ఎంవీ సాయిబాబు, సామాజికవేత్త యలమంచిలి అంజని, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రూప్‌కుమార్, సతీష్‌బాబు, ట్రెజరర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఉయ్యూరు మున్సిపాలిటీ సమావేశం

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం సోమవారం చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక అతిథిగా హాజరవుతారన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీలో చేయనున్న అభివృద్ధి పనులకు బడ్జెట్ ఆమోదంతో పాటు పలు అంశాలపై చర్చించి నిర్ణయాలను తీసుకుంటారన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పెనమలూరు: గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. ఆయన ఆదివారం గ్రామంలోని శ్రీహరి గార్డెన్స్‌లో విస్తృతంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాలనీవాసులతో కలిసి పని చేస్తానని హామీ ఇచ్చారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: పోరంకి లక్ష్మీపురంకాలనీలోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరం వసంత రుతువు సందర్భంగా స్వామి వారికి వసంతోత్సవం ఘనంగా చేశారు. 108 కలశాలతో పంచామృతాభిషేకం జరిగింది. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటలకు అభిషేకం, 6 గంటలకు 12 రకాల పుష్పాలతో శోభాయాత్ర, అనంతరం స్వామివారికి పుష్పయాగం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1,604 డ్వాక్రా గ్రూపులకు లబ్ధి

గన్నవరం:స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 27వ తేదీ వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జేవీఎస్‌ఆర్‌కె. ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
మండలంలోని 1,604 డ్వాక్రా గ్రూపులకు రూ. 15.20 కోట్లు విడుదలయ్యినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.



దావులూరు వద్ద మొక్కజొన్న చేను చుట్టూ ఏర్పాటు చేసిన దోమతెరలు



కంకిపాడు బైపాస్ వద్ద చేను చుట్టూ కట్టిన చీరలు

భళా.. రైతుల పంట రక్షణ ఆలోచన

చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతన్నలు సరికొత్తగా ఆలోచిస్తున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో మొక్కజొన్న, జొన్న పైర్లను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం జొన్న కంకులు వేసింది. మొక్కజొన్న కండెలు సిద్ధమయ్యాయి. మార్కెట్‌కు తరలించే సమయం ఆసన్నమవుతోంది. ఈ పరిస్థితుల్లో పంట పక్షుల దాడికి గురికాకుండా రైతులు పంట సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. జొన్న కంకులు, మొక్కజొన్న కండెలు కనిపించకుండా చేను చుట్టూ చీరలను, దోమ తెరలను కట్టి పక్షుల నుంచి కాపాడుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు పంట చుట్టూ మెరుపుల రిబ్బన్లను కట్టి పక్షుల చూపు మరల్చే యత్నం చేసి పంటను సంరక్షించుకుంటున్నారు.

–కంకిపాడు



కొణతనపాడు అడ్డరోడ్డు వద్ద ..

నేరుగా ప్రభుత్వ పథకాలు

- జగనన్న పాలనలోనే భరోసా
- గడప గడపలో ఆనందం వ్యక్తం చేసిన పేదలు



జగన్న పాలనలో అందిన సంక్షేమ పథకాల వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: 'తమకు ప్రభుత్వం నుంచి నేరుగా సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయి.. జగనన్న పాలనలో అందరు క్షేమంగా ఉన్నామని' కాల్వ కట్ట వాసులు అలక నాగమణి, మద్దాల లక్ష్మి అన్నారు. తాడిగడప వసంతనగర్ కాల్వ కట్టపై ఆదివారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయన.. ప్రభుత్వం పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ లబ్ధిదారులకు అందజేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ మూడేన్నర్లేళ్లలో ప్రభుత్వం నుంచి ఆసరా, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇళ్ల స్థలాలు, ఇతర పథకాలు అందాయన్నారు. పింఛన్.. సమయానికి వచ్చి పంపిణీ చేస్తున్నారని తెలిపారు. తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. వాటిని పరిష్కరించాలని మున్సిపాలటీ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.

మీతోనే ప్రభుత్వం..

జగనన్న పాలనలో ప్రజలతోనే ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పేదలకు సంక్షేమ పథకాల అమలు చేస్తున్నందుకు టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, సంక్షేమ పథకాలు నిలుపు చేయాలని టీడీపీ ప్రకటన చేయగలదా అని ప్రశ్నించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సంక్షేమ పథకాలు అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎన్. ప్రకాశరావు, నేతలు తుమ్మల వరదీష్, వేమూరి బాలకృష్ణ, ఈదారాజేష్, షేక్.ఖాదర్‌బాషా, ఎల్లారావు, ముచ్చు నాగేంద్ర, పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పాఠశాల ప్రాంగణంలో 1973 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ ఆదివారం సందడిగా జరిగింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని ఆలనాటి స్నేహ అనుభూతులను పంచుకున్నారు. 50 వసంతాల తర్వాత 1973 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఏరా.. ఒరేయ్.. ఎలా ఉన్నావ్.. ఏమి చేస్తున్నావ్ అంటూ చిన్ననాటి స్నేహితులు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బాల్యంలోని మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పాఠశాలలో చదువుకునేటప్పుడు చేసిన చిలిపి చేష్టలు, చిరు తగాదాలు, ఉపాధ్యాయులకు పెట్టిన మారు పేర్లు, తోటి స్నేహితులపై వేసిన జోకులు గుర్తుచేసుకున్నారు. ఆరు పదుల వయస్సులో పూర్వ విద్యార్థులంతా పాఠశాల ప్రాంగణంలో మళ్లీ చిన్నపిల్లల్లా మారిపోయారు. రోజంతా బాల్యమిత్రులతో హుషారుగా, సంతోషంగా గడిపారు. తమ పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు ఎక్కడెక్కడ ఉద్యోగాలు, చదువులు కొనసాగిస్తున్నారో పరస్పరం అడిగి తెలుసుకున్నారు. తమ చిన్ననాటి తరగతిగదులు, బెంచీలు చూసుకుని ఎంతో మురిసిపోయారు. తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన ఉపాధ్యాయులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన కొల్లి సత్య జగదీశ్వరరావు, కొండవీటి కుటుంబరావు, ఆళ్ల కృష్ణారావులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు లంక గోపాలకృష్ణామూర్తి, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, లింగంనేని బాబురావు, కామినేని కృష్ణకుమారి, తవ్వా ప్రభాకర్, వక్కలగడ్డ నాగేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

సీఐటీయూ నిరసన



కంకిపాడు: త్రిపుర రాష్ట్రంలో కార్మికవర్గంపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీఐటీయు జిల్లా నాయకులు సీహెచ్ వెంకట రెడ్డయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పలూరులో సీఐటీయు ఆధ్వర్యాన ఆదివారం నిరసన చేపట్టారు. వెంకట రెడ్డయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ త్రిపుర రాష్ట్రంలో కార్మికులు, కార్మిక సంఘాల కార్యాలయాలపై దాడులు చేయటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కలపాల మురళి, జంపాన వీరాస్వామి, మొనగాల లక్ష్మీనారాయణ, నారం సర్వేశ్వరరావు, దానియేలు పాల్గొన్నారు.

పెనమలూరు: పోరంకి సెంటర్‌లో సీపీఎం, సీఐటీయూ నేతలు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, అర్బన్ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ త్రిపురలో కార్మిక నేతలు, ఆఫీసులపై దాడి చేయటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నేతలు పి.లక్ష్మీనారాయణ, అమలేశ్వరరావు, జి.వీరయ్య, రాజేశ్వరరావు, రాంబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామని రూరల్ తహసీల్దారు పి.జాహ్నవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో పాల్గొనే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొనాలన్నారు.

పాఠశాలకు గేటు వితరణ

ఉయ్యూరు: కాటూరు జెడ్పీ పాఠశాలకు 2004–05 పదో తరగతి పూర్వ విద్యార్థులు కొత్త గేటును బహూకరించారు. స్థానిక పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాఠశాల ప్రధాన ద్వారానికి గేటు పాతది కావటంతో పూర్వ విద్యార్థులు గేటును తయారు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, ఎంపీటీసీలు తోట శ్రీలక్ష్మి, అనూష, పూర్వ విద్యార్థులు మీగడ శ్రీనివాసరావు, శివశంకర్, సురేష్, గీత, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.



పాఠశాల ప్రధాన ద్వారం వద్ద పూర్వ విద్యార్థులు

సమాజంలో మంచిగా జీవిస్తేనే విలువ

ఆటోనగర్(విజయవాడతూర్పు): సమాజంలో మంచిగా జీవించిన వారికే విలువలు ఉంటాయని, చేసిన తప్పును సరిదిద్దుకొని తద్వారా మంచిగా జీవించాలని విజయవాడ సెంట్రల్ ఏసీపీ ఎస్‌కె ఖాదర్‌బాషా సూచించారు. ఫన్‌టైమ్ రోడ్డులోని ఏసీపీ కార్యాలయం ఆవరణలో రౌడీషీటర్‌లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్ల వివరాలను ఏసీపీ అడిగి తెలుసుకున్నారు. వీరు చేస్తున్న పనులపై ఆరా తీశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. క్షణికావేశంలో చేసిన పనులను మరిచి... మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. కుటుంబాలను పోషించుకోవడంతో పాటు పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలన్నారు. గంజాయి అమ్మినా, తాగినా నేరమని, ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదన్నారు. తగాదాల్లో తలదూర్చకూడదన్నారు. ప్రవర్తనలో మార్పు వస్తే రౌడీషీట్ ఎత్తి వేస్తామని చెప్పారు. కౌన్సెలింగ్‌లో ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ ఖాదర్ బాషా, పోలీస్ అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. విజయవాడకు చెందిన సాయిశ్రీ నృత్య అకాడమీకి చెందిన నిత్యశ్రీ, ఖ్యాతి, లక్ష్మీ, తేజ, కళ్యాణ్‌తో పాటు మరి కొంత మంది పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఈ ప్రదర్శన జరిగింది. అనంతరం నృత్యకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.



త్రిశక్తి పీఠంలో సంపంగి పూలతో అర్చన



కృష్ణలంక(విజయవాడ తూర్పు): నగరంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో శోభకృత్ నామ సంవత్సర వసంత నవరాత్రుల సందర్భంగా ఆదివారం శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు 3 వేల సంపంగి పూలతో విశేషంగా అర్చన, పూజలు జరిపించారు. ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయ్‌కిరణ్, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.జగదీష్, జి.పుల్లయ్య, ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు, సభ్యుడు జి.సత్యం పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశార్చన



ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న హోమం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి అష్టోత్తర శత కలశార్చనను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో 108 కలశముల మంత్ర జలముతో 108 జంటల దంపతులచే కలశార్చనను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా మహాలక్ష్మి యాగం చేశారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, వివాహ, సంతాన, గృహ సంబంధిత సకల కార్యసిద్ధి జరిగేందుకు ఆలయ పురోహితులు మహాలక్ష్మి హోమాన్ని పూర్తి చేశారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కవయిత్రి శైలజా శ్రీనివాస్‌కు కవితోత్సవ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కవయిత్రి శైలజా శ్రీనివాస్

కంకిపాడు: పట్టణానికి చెందిన కవయిత్రి శైలజా శ్రీనివాస్ జల పరిరక్షణ కవితోత్సవ పురస్కారం అందుకున్నారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్‌లో నగర జల మండలి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జల పరిరక్షణ కవితోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో శైలజా శ్రీనివాస్ జల పరిరక్షణపై కవితలను వినిపించి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శైలజా శ్రీనివాస్ ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. సామాజిక అంశాలపై కవితలను రచించి సాహితీసేవ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

లక్ష్మీ తిరుపతమ్మకు ఎర్ర కలువలతో అర్చన

గన్నవరం: పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో వసంత నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ఎర్ర కలువ పుష్పాలతో అర్చన చేశారు. తొలుత లక్ష్మీతిరుతపమ్మ సన్నిధిలో భక్తులు లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పొంగళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి ఎర్ర కలువలతో చేసిన అర్చన

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: రైల్వే స్టేషన్‌లో మూడవ ట్రాక్ లైన్ పనులు కారణంగా వీరపనేనిగూడెం సబ్‌స్టేషన్‌కు వెళ్లే విద్యుత్ సరఫరాను సోమవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వహణ ఇంజినీర్ పి. హరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బీబీ గూడెం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, చిక్కవరం, కొత్తగూడెం, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, తెంపల్లి, బల్లిపర్రు గ్రామాలకు పైన తెలిపిన సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించడం హర్షణీయం

కంకిపాడు: దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయటం హర్షణీయమని పీవీ రావు మాలమహానాడు ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ దళిత క్రిస్టియన్లు ఎస్సీలుగా గుర్తించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించటం మంచి పరిణామమన్నారు. కేంద్రంలోని బీజేపీ ఈ అంశంపై సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

మహిళా సాధికారతతోనే ప్రగతి సాధ్యం

విజయవాడకల్చరల్: మహిళా సాధికారతతోనే ప్రగతి సాధ్యమని ఆంధ్రా, తెలంగాణా ఆదాయపుపన్నుశాఖ జాయింట్ కమిషనర్ కోటేశ్వరమ్మ అన్నారు. అమ్ముల విశ్వనాథ కళాసమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటశాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో హరికథా విద్వాంసులు అమ్ముల విశ్వనాథ భాగవతార్ పేరుతో నిర్వహించే ఉగాది మహిళా పురస్కారాల కార్యక్రమాన్ని ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కోటేశ్వరమ్మ మాట్లాడుతూ.. మహిళల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసముందన్నారు. సభకు అధ్యక్షత వహించిన న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. మహిళలో ప్రగతి పథంలో పయనిస్తున్నారని భావి భారతదేశానికి పునాదులు వారేనన్నారు. నిర్వాహకుడు అమ్ముల ప్రసాద్ సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అంబటిమధుమోహన కృష్ణ, తటవర్తి సూర్యనారాయణ, కొప్పరపు బలరామకృష్ణమూర్తి పాల్గొన్నారు. వలివేటి వేంకట శివరామకృష్ణ మూర్తి నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన దండమూడి సుమతీ రామ్మోనరావు, సీహెచ్ పద్మావతి, అవిరెడ్డి సునయన, సునయన లఖంరాజు, పద్మశ్రీ లఖంరాజులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఉచిత సంగీత శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సంగీత శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచితంగా సంగీతం నేర్పుతున్నామన్నారు. టీచర్ మాధురి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, గ్రేడ్ 3 గ్రంథ పాలకురాలు వై.ధనలక్ష్మి, సిబ్బంది జె.శంకర్, గోపాలరావు, ఫణిబాబు పాల్గొన్నారు.